క్లుప్తంగా

ఐక్యతకు మూలం హిందీ



వేడుకలో విద్యార్థులు, ఉపాధ్యాయులు

కార్వేటినగరం: దేశ ప్రజల ఐక్యతకు మూలం హిందీ భాష అని డీఎంపురం హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు నాదమునిరెడ్డి తెలిపారు. ఆదివారం జాతీయ హిందీ భాషాదినోత్సవం సందర్భంగా శుక్రవారం పాఠశాలలో ముందస్తు కార్యక్రమం నిర్వహించారు. హిందీ టీచర్ మాలతి మాట్లాడుతూ దేశంలో హిందీ ఆవశ్యకత, ప్రాధాన్యతను వివరించారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, డ్రాయింగ్ పోటీలు చేపట్టారు. విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు.

ఇరుకు రోడ్డుతో ఇక్కట్లు



రోడ్డుపై ఇరుక్కున్న వాహనాలు

వెదురుకుప్పం: కార్వేటినగరం–పచ్చికాపల్లం ప్రధాన రహదారి ఇరుకుగా ఉండడంతో వాహనదారులు నానా అవస్థలు పడుతున్నారు. ఎదురెదురుగా వచ్చిన వాహనాలను తప్పించేందుకు డ్రైవర్లు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా గురవరాజగుంట వద్ద దాదాపు నిత్యం వాహనాలు ఇరుక్కుపోతున్నాయి. దీంతో ట్రాఫిక్ స్తంభిస్తోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రహదారి విస్తరణకు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

డ్వాక్రా రుణాల పంపిణీ

వెదురుకుప్పం: డ్వాక్రా మహిళలకు ఎమ్మెల్యే థామస్ చేతులమీదుగా రుణాలు పంపిణీ చేసినట్లు ఏపీఎం పరశురామరెడ్డి తెలిపారు. శుక్రవారం వెదురుకుప్పంలో నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే ఈ మేరకు చెక్కులను అందించినట్లు వెల్లడించారు.

సంకల్ప్ కార్యక్రమంపై అవగాహన



సంకల్ప్ కార్యక్రమంపై అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ

నగరి: ఎస్‌జీఎస్ బాలికల జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల, మున్సిపల్ పరిధిలోని ఏకాంబరకుప్పం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలల్లోని విద్యార్థులకు సీడీపీఓ ఇందిరా ప్రియదర్శిని 10 రోజుల సంకల్ప్ కార్యక్రమంపై అవగాహన కల్పించారు. శుక్రవారం పాఠశాలకు వెళ్లిన ఆమె విద్యార్థులకు లింగ వివ, బాల్యవివాహాలతో కలిగే నష్టాలు, వ్యక్తిగత పరిశుభ్రత, ఫోక్సో చట్టం, బాల్య వివాహాల చట్టం, పోషకాహారం ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. ప్రధానోపాధ్యాయులు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై విద్యార్థులకు అవగాహన



అవగాహన కల్పిస్తున్న స్టెప్స్ సిబ్బంది

నగరి: రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ విభాగం సహకారంతో స్టెప్స్ ఆర్గనైజేషన్ వారు విద్యార్థులకు హెచ్‌ఐవీపై అవగాహన కల్పించారు. శుక్రవారం స్థానిక పీసీఎన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో హెచ్‌ఐవీ ఎయిడ్స్ వ్యాధి ఎలా వ్యాపిస్తుంది, ఎలా వ్యాపించదు, రాకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఏఎన్‌ఎం సుమ, ఔట్ రీచ్ వర్కర్ ఇందుమతి వివరించారు. వ్యాధిగ్రస్తులపై వివక్ష, చిన్న చూపు లేకుండా ఎలా సమాజంలో కలిసి జీవించాలో తెలియజేశారు. వీటితోపాటు క్షయ వ్యాధి, సుఖ వ్యాధుల చికిత్సపై తీసుకోవాల్సిన మందులు, సందేహాలకు టోల్ ఫ్రీ నెంబర్ 1097లో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయిని శ్యామల, ఉపాధ్యాయులు సునీత, రేవతి, స్టెప్స్ ఎడ్యుకేటర్లు శీలారాణి, గుణసుందరి తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రానికి టీవీ



టీవీని అందజేస్తున్న బీజేపీ నాయకులు

పుత్తూరు: ఎంబీ రోడ్డులోని అంగన్‌వాడీ కేంద్రానికి శుక్రవారం స్థానిక బీజేపీ నాయకులు 34 ఇంచెస్ ఎల్‌ఈడీ టీవీని అందజేశారు. బీజేపీ నగరి నియోజకవర్గ కన్వీనర్ కేఎన్ హరిబాబు మాట్లాడుతూ అంగన్‌వాడీ పిల్లలకు పౌష్టికాహారం పంపిణీలో అధికారులు తగిన పర్యవేక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఉదయ్‌కుమార్, శేఖర్‌మూర్తి, వెంకటరమణ, శేషారెడ్డి, మహేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

అడ్డదారి వెంచర్లు

- పల్లెల్లో అనుమతి లేకుండా నిర్మాణాలు
- పది శాతం స్థలాన్ని వదలకుండానే ప్లాట్లు
- చోద్యం చూస్తున్న అధికారులు



మహరాజపురంలో వెలసిన లేఅవుట్

విజయపురం: ఇది వరకు నగరం, పట్టణాలలో వెలసిన అక్రమ లేఅవుట్లు ఇప్పుడు పల్లెలను తాకుతున్నాయి. అనుమతులు లేకుండా ఇష్టారాజ్యంగా అక్రమ లేఅవుట్లు వేసి ప్రజలను మోసం చేస్తున్నారు. వ్యవసాయ పొలాల్లో అక్రమ లేఅవుట్లు వేస్తున్నా అధికారులు చోద్యం చేస్తున్నారు. విజయపురం మండలం, మహారాజపురం ఆర్‌అండ్‌బీ రహదారి పక్కన ఉన్న ఓ వ్యవసాయ భూమిలో కొందరు వెంచర్లు వేస్తున్నారు. అది చూసి మరి కొందరు ఇల్లత్తూరు, పన్నూరు సబ్‌స్టేషన్, విజయపురం, గాండ్లకండ్రిగ, తిరుత్తణి–నాగలాపురం రహదారి పక్కన ఉన్న మరో వ్యవసాయ భూమిని కొందరు వెంచరుగా ఏర్పాటు చేశారు. ఇలా మండలంలో ఎక్కడి పడితే అక్కడ సంబంధిత గ్రామ పంచాయతీ నుంచి ఎలాంటి అనుమతులు తీసుకోకుండానే ప్లాట్లుగా విభజించి అడ్డంగా అమ్మకాలు జరుపుతూ సొమ్ము చేసుకుంటున్నారు. నాలా కన్వర్షన్ లేకుండానే లే అవుట్ చేసి దండుకుంటున్నారు. నిబంధనలను గాలికి వదిలేసి పెద్ద పెద్ద ప్లాట్లులగా విభజించి రూ.లక్షల్లో లాగేస్తున్నారు. దీనికి సమీపంలోని ప్రభుత్వ పాఠశాల, ఆలయలకు వెళ్లే రహదారిని కూడా ప్లాట్లకు అనువుగా మలుచుకొని మ్యాపులో చూపుతూ విక్రయాలు చేపడుతున్నారు. నిబంధనల ప్రకారం పది శాతం గ్రామ పంచాయతీ అభివృద్ధికి పార్కుకు తదితర అవసరాల కోసం భూమిని వదిలేయాల్సి ఉన్నా అవేమీ వదిలేయకుండానే రియల్‌గా దండుకుంటున్నారు.

జోరుగా అక్రమ వెంచర్ల దందా

మండలంలో అక్రమ వెంచర్ల దందా జోరుగా సాగుతోంది. ఎలాంటి అనుమతులు లేకుండానే వ్యాపారులు ప్లాట్లు చేసి విక్రయిస్తున్నారు. అక్రమ వెంచర్లు వెలుస్తున్న వాటిలో ఎకరం మొదలు 5 ఎకరాల వరకు ఉన్నవే అధికంగా ఉంటున్నాయి. ఈ తరహా వెంచర్లలో పట్టాదారు పాసుబుక్ ఆధారంగా కొనుగోలుదారులకు రిజిస్ట్రేషన్ జరిగేలాచూస్తున్నారు. అనుమతులు పొందినట్లు కొందరు, అనుమతులు వచ్చేస్తున్నాయని మరికొందరు ప్లాట్లను అమ్ముతూ అమాయక ప్రజలను మోసం చేస్తున్నారు. పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న అక్రమ వెంచర్లపై చర్యలు తీసుకోవాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ప్లాట్లను కొనుగోలు చేసిన తర్వాత వాటికి అధికారిక అనుమతులు లేవని తెలుసుకుని ప్రజలు నానా పాట్లు పడాల్సి వస్తోంది. ప్లాటు కొనుక్కుంటున్న మధ్య తరగతి వారు నిర్మాణ అనుమతులకు వెళ్లినప్పుడు అసలు నిజాలు బయటపడుతుండడంతో నివ్వెరపోతున్నారు.

ప్రధాన రహదారుల పక్కనే..

మండలం వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో ప్రధాన రహదారులు ఆనుకొని విచ్చలవిడిగా వెంచర్ల దందా కొనసాగుతోంది. ప్రధాన పట్టణాల శివారు ప్రాంతాలు, జాతీయ రహదారి ప్రాంతాలతో పాటు పలు మేజర్ గ్రామ పంచాయతీల్లోనూ ఇదే తరహా వ్యాపారం కొనసాగుతోంది. అసైన్డ్ భూముల్లోనూ ప్లాటుకు పంచాయతీ ద్వారా ఇచ్చే యాజమాన్య ధ్రువపత్రం, ఇంటి నంబర్లతో రిజిస్ట్రేషన్లు చేస్తున్నారు. నాలా అనుమతి లేని సాగు భూముల్లో వెలసిన వెంచర్లలో కొనుగోలుదారులకు గుంటల లెక్కన రిజిస్ట్రేషన్లు చేపడుతున్నారు. పలు ప్రాంతాల్లో నిబంధనలకు విరుద్ధం కాలువలను పూడ్చేసి మరీ ప్లాట్లుగా చేస్తున్నారు.

సర్కారు ఆదాయానికి భారీగా గండి

లేఅవుట్ అనుమతులు లేకుండా ఏర్పాటు చేస్తున్న వెంచర్ల కారణంగా ప్రభుత్వ ఆదాయానికి పెద్ద ఎత్తున గండి పడుతోంది. పెద్ద మొత్తంలో రియల్ ఎస్టేట్ వ్యాపారుల జేబుల్లోకి వెళ్తోంది. అధికారుల నుంచి నాలా కన్వర్షన్ అనుమతులు రాగానే లేఅవుట్ కోసం మున్సిపాలిటీ, గ్రామ పంచాయతీలకు దరఖాస్తు చేసుకోవాలి. ఇందుకు కోసం నిర్ణీత స్థలంలో నుంచి పది శాతం భూమిని పార్కులు నిర్మాణం, ఇతర అవసరాలకు అప్పగించాల్సి ఉంటుంది.

నిబంధనలకు తూట్లు

పట్టా భూముల్లో వెంచర్లు ఏర్పాటు చేయాలంటే మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీలలో పలు నిబంధనలు ఉన్నాయి. వెంచర్లు ఏర్పాటు చేసే స్థలాలు వ్యవసాయ భూములుగా, పారిశ్రామిక ప్రాంతాలుగా ఉండకూడదు. నివాసయోగ్యంగా ఉండాలి. వ్యవసాయ భూముల్లో వెంచర్లు ఏర్పాటు చేయాలంటే మొదట వాటిని నివాస స్థలాలుగా మార్చుకోవాల్సి ఉంటుంది. ఇందుకు నిర్ణీత రుసుం చెల్లిస్తూ సంబంధిత అధికారులకు నాలా కన్వర్షన్ కోసం దరఖాస్తు చేసుకోవాలి. నాలా కన్వర్షన్ అనంతరం లేఅవుట్ అనుమతులు సంబంధిత మున్సిపాలిటీ లేదా గ్రామ పంచాయతీ నుంచి తీసుకోవాలి. అయితే ఇవేమీ లేకుండానే రియల్ ఎస్టేట్ వ్యాపారులు వ్యవసాయ భూములలో అక్రమంగా వెంచర్లు వేసేస్తున్నారు.



వ్యవసాయ భూముల్లో సిద్ధమవుతున్న వెంచర్

యాజమాన్యంతో అధిక దిగుబడి



మాట్లాడుతున్న శాస్త్రవేత్త సుధాకర్

కార్వేటినగరం: కొబ్బరి సాగులో యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడి సాధించవచ్చని రాస్ కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ పీఎస్ సుధాకర్ తెలిపారు. శుక్రవారం మండలంలోని ఆర్కే వీబీపేట రైతుసేవా కేంద్రంలో శాస్త్రవేత్త మాట్లాడుతూ కొబ్బరి సాగులో సమగ్ర పోషక యాజమాన్య, సమగ్ర సస్యరక్షణ విధానాలను ఆచరిస్తే రైతుకు సాగు ఖర్చు తగ్గి ఆశించిన ఆదాయం వస్తుందని వెల్లడించారు. అలాగే పంట దిగుబడి, నాణ్యత పెరుగుతుందన్నారు. ఏఓ హేమలత మాట్లాడుతూ రైతులు తప్పనిసరిగా పంట నమోదు చేయించుకోవాలని కోరారు. నానోయూరియా వాడకంతో పొందే ప్రయోజనాలను వివరించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పుత్తూరు: రూరల్ మండల పరిధిలో శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏపీ ట్రాన్స్‌కో ఏఈ జైసాయి ఒక ప్రకటనలో తెలిపారు. పైడిపల్లి, కళ్యాణపురం, దిగువపుత్తూరు, పరమేశ్వరమంగళం గ్రామాల వద్ద ఉన్న 33/11 కేవీ సబ్‌స్టేషన్లలో మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు వెల్లడించారు. వినియోగదారులు సహకరించాల్సిందిగా కోరారు.

కార్వేటినగరం: సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శనివారం శ్రీరంగరాజపురం, వెదురుకుప్పం, కార్వేటినగరం మండలాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఏడీఈ చంద్రబాబు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ ఉండదని వెల్లడించారు.

పొన్నియమ్మ ఉత్సవాల్లో మాజీ మంత్రి



పొన్నియమ్మ సేవలో మాజీ మంత్రి ఆర్కే రోజా

నగరి: మున్సిపల్ పరిధి కేవీపీఆర్ పేటలో వైభవంగా నిర్వహిస్తున్న పొన్నియమ్మ జాతర ఉత్సవాల్లో మాజీ మంత్రి ఆర్కే రోజా పాల్గొన్నారు. శుక్రవారం రాత్రి ఉత్సవాలకు హాజరైన మాజీ మంత్రికి నిర్వాహకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. గర్భగుడిలోని పొన్నియమ్మను, మహాకాళి అవతారంలో ఉన్న ఉత్సవమూర్తిని ఆమె దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ పూజారులు వేదమంత్రాలతో ఆశీర్వదించి ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు గంగాధరం, బాలకృష్ణ, అయ్యప్ప, భూపాలన్, రమేష్‌రెడ్డి, మురుగ, ఇంద్రయ్య, గోవిందరెడ్డి, ఎల్లప్పరెడ్డి, ఆనంద్‌కుమార్, మణి తదితరులు పాల్గొన్నారు.

దాతల సేవలు అభినందనీయం



రవికుమార్‌రాజును సత్కరిస్తున్న ఎంఈఓ

కార్వేటినగరం: పాఠశాలల అభివృద్ధికి సహకరిస్తున్న దాత సేవలు అభినందనీయమని ఎంఈఓ విజయకుమార్ తెలిపారు. శుక్రవారం కేఎంపురం ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో దాత రవికుమార్ రాజు రూ.50వేలతో నిర్మించిన డిన్నర్‌హాల్‌ను హెచ్‌ఎం చలపతిరావుతో కలిసి ఆయన ప్రారంభించారు. ఎంఈఓ మాట్లాడుతూ రవికుమార్‌రాజు గొప్ప సేవాతత్పరుడని కొనియాడారు. దాత మాట్లాడుతూ తమ గ్రామంలో ఆదర్శ ప్రాథమిక పాఠశాలను ఏర్పాటు చేయడం అదృష్టంగా భావిస్తున్నట్లు వెల్లడించారు. అనంతరం దాతను ఘనంగా సత్కరించారు. పాఠశాల కమిటీ చైర్మన్ సురేష్, స్థానికులు ఓం ప్రకాష్, విజయులురెడ్డి, దక్షణామూర్తి, గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

మండల సమగ్రాభివృద్ధే లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ సరిత

శ్రీరంగరాజపురం: మండల సమగ్రాభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు ఎంపీపీ సరిత తెలిపారు. శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాల్లో పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యమివ్వాలని సూచించారు. గ్రామ సభలో గుర్తించిన పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి డంపింగ్ యార్డుకు తరలించాలని ఆదేశించారు. చెత్త నుంచి సేంద్రియ ఎరువులను తయారు చేయాలని, ఈమేరకు పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని స్పష్టం చేశారు. కో–ఆప్షన్ సభ్యుడు ఏసయ్య మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఇప్పటి వరకు తమకు వేతనం చెల్లించలేదని ఆరోపించారు. అన్నదాత సుఖీభవ, తల్లికివందన పథకాలను కొందరు అర్హులకు సైతం అందించలేదని, ఇదెక్కడి న్యాయమని ప్రశ్నించారు. రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలను అర్హులందరికీ అందించాలని కోరారు. జెడ్పీటీసీ సభ్యుడు రమణప్రసాద్‌రెడ్డి, ఎంపీడీఓ మోహన్‌మురళి, తహసీల్దార్ లోకనాథపిళ్లై, సొసైటీ చైర్మన్ నిరంజన్‌రెడ్డి పాల్గొన్నారు.

బాల్య వివాహాలతో అనర్థాలు



సమావేశంలో మాట్లాడుతున్న సీడీపీఓ శోభారాణి

కార్వేటినగరం: బాల్య వివాహాలతో పలు అనర్థాలు వాటిల్లుతాయని ఐసీడీఎస్ సీడీపీఓ శోభారాణి తెలిపారు. శుక్రవారం కత్తెరపల్లె ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించారు. పోషకాహారం తీసుకోవాలని సూచించారు. బాలికలకు 18 ఏళ్లు నిండిన తర్వాతే వివాహం చేయాలని కోరారు. లేకుంటే అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని వెల్లడించారు. బాల్య వివాహాల నిర్మూలనపై పోలీసులు సైతం ప్రత్యేక నిఘా పెట్టినట్లు తెలిపారు. పిల్లలకు చిన్న వయసులో పెళ్లి చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎక్కడైనా బాల్య వివాహం జరుగుతున్నట్లు తెలిస్తే వెంటనే టోల్ ఫ్రీ నంబర్ 112కు సమాచారం అందించాలని సూచించారు. కిశోర బాలికలు తప్పనిసరిగా వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని కోరారు. ప్రధానోపాధ్యాయుడు చెంగల్‌రాజు, అంగన్‌వాడీలు సుగుణ, కృష్ణకుమారి, రాజేశ్వరి, రాధిక, విమల పాల్గొన్నారు.

దసరాకు మధ్యంతర భృతి ప్రకటించాలి



కరపత్రాలు విడుదల చేస్తున్న ఉపాధ్యాయులు

పుత్తూరు: దసరా పండుగను పురస్కరించుకొని ప్రభుత్వం 30 శాతం మధ్యంతర భృతిని ప్రకటించాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం(ఆపస్) డిమాండ్ చేసింది. శుక్రవారం మండల పరిధిలోని పలు పాఠశాలలను సందర్శించిన సంఘం నాయకులు కరపత్రాలు విడుదల చేశారు. వారు మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు ఎంతో కాలంగా పెండింగ్‌లో ఉన్న దాదాపు 30 వేల కోట్ల ఆర్థిక బకాయిలలో కొంత మేరకైనా చెల్లించాలని కోరారు. కాంప్లెక్స్ స్థానాల్లో పనిచేస్తున్న గణిత, ఆంగ్ల ఉపాధ్యాయులకు శాశ్వత స్థానాలు కేటాయించాలన్నారు. కార్యక్రమంలో సంఘ జిల్లా గౌరవాధ్యక్షుడు మేకల సుబ్రమణ్యం, ప్రధాన కార్యదర్శి సాంబిరెడ్డి, ఉపాధ్యక్షుడు శివకుమార్, కార్యదర్శి సుబ్రమణ్యం, క్రీడా, అకడమిక్ కన్వీనర్లు గురప్ప, గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

పేదల పక్షపాతి నారాయణస్వామి



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ మణి

శ్రీరంగరాజపురం: మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి పేదల పక్షపాతి అని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ మణి కొనియాడారు. శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. మచ్చలేని నేత నారాయణస్వామి అని, ఆయనను టీడీపీకి చెందని కొందరు చోటా నేతలు తమ స్థాయి మరచి విమర్శలు గుప్పిస్తున్నారని మండిపడ్డారు. దళితుల అభ్యున్నతే లక్ష్యంగా నారాయణస్వామి రాజకీయాల్లోకి వచ్చారని వెల్లడించారు. సర్పంచ్ సమితి అధ్యక్షుడు, ఎమ్మెల్యే, మంత్రి, డిప్యూటీ సీఎం స్థాయికి ఎదిగారని వివరించారు. జీడీ నెల్లూరు నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించిన ఘనత నారాయణస్వామికే దక్కుతుందని స్పష్టం చేశారు. 50పడకల ఆస్పత్రులు 2, టీడీపీ కల్యాణమండపం, వైఎస్సార్ డిగ్రీ కళాశాల, అగ్నిమాపక కేంద్రం, రూ.192 కోట్లతో ఎన్టీఆర్ జలాశయం ఆధునికీకరణ, రూ.10 లక్షల చొప్పున 216 ఆలయాలకు మంజూరు, టీటీడీలో 3 ఆలయాలు విలీనం, రూ.కోటి నిధులతో 27 ఆలయాల జీర్ణోద్ధరణ, ఫారెస్టులో రోడ్డు నిర్మాణం, శ్రీరంగరాజపురం వ్యవసాయ మార్కెట్ భవన నిర్మాణం కోసం రూ.50 కోట్లు మంజూరు, నాలుగు మండలాల ప్రజల సౌకర్యార్థం ఉడమలకూర్తి వద్ద ఫ్లైఓవర్ వంతెన నిర్మాణానికి రూ.27 కోట్లు మంజూరు, 49 కొత్తపల్లిమిట్ట నుంచి పచ్చికాపల్లం వరకు రూ.9 కోట్లతో రోడ్డు మరమ్మతులు, 49 కొత్తపల్లిమిట్ట వద్ద స్మార్ట్ డీపీ పరిశ్రమ స్థాపనకు కృషి చేశారని వివరించారు. ప్రస్తుత ఎమ్మెల్యే డాక్టర్ థామస్ మాత్రం కేవలం మాటలతోనే కాలయాపన చేస్తున్నారని, అభివృద్ధి శూన్యమని విమర్శించారు. నిత్యం వేల టన్నుల ప్రకృతి వనరులు తమిళనాడుకు తరలిపోతున్నా పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి కుప్పయ్య, ఎంపీపీ సరిత జనార్దన్, పార్టీ నియోజవర్గ సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు మణి, సర్పంచ్‌లు చిట్టి మహేష్, అమృతరాజ్, బాబు, ఎంపీటీసీ సభ్యుడు లోకనాథం రెడ్డి, మాజీ సర్పంచ్‌లు భూపతిరెడ్డి, తయ్యూరు బాబు, రామచంద్రయాదవ్, నేతలు జయ, రఘు, ఎన్ఆర్ పురం నాయుడు పాల్గొన్నారు.

కళా ఉత్సవ్‌లో విద్యార్థినుల ప్రతిభ



విద్యార్థినులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

కార్వేటినగరం: జిల్లా విద్యాశిక్షణ సంస్థ (డైట్)లో 11, 12వ తేదీల్లో నిర్వహించిన కళా ఉత్సవ్ పోటీల్లో కార్వేటినగరం బాలికల ఉన్నత పాఠశాల ప్లస్ విద్యార్థినులు ప్రతిభ చాటినట్లు హెచ్‌ఎం శేఖర్ తెలిపారు. శుక్రవారం ఈ మేరకు విద్యార్థినులను అభినందించారు. హెచ్‌ఎం మాట్లాడుతూ జిల్లా స్థాయి పోటీల్లో తమ పాఠశాలకు చెందిన రిషిత, నాగదీపిక, వైశాలి, భవానీ నాదస్వరం పోటీల్లో ప్రథమ స్థానం దక్కించుకున్నట్లు వెల్లడించారు. రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించారని వివరించారు. గైడ్ ఉపాధ్యాయులు వేణుగోపాల్, కన్నయ్య, చిత్ర, జయదేవ్ పాల్గొన్నారు.

నేత్రపర్వం.. గ్రామదేవతల ఊరేగింపు

- ప్రత్యేక ఆకర్షణగా సాంస్కృతిక కార్యక్రమాలు

నగరి: గంగమ్మ జాతరలో భాగంగా ప్రతి ఏడాది అత్యంత ప్రత్యేకతను చాటుకునే గ్రామదేవతల ఊరేగింపు కార్యక్రమం శుక్రవారం రాత్రి నేత్రపర్వంగా సాగింది. ఓరుగుంటాలమ్మ దేవతను వరలక్ష్మిగా, దేశమ్మ దేవతను సింహవాహినిగా అలంకరించగా భక్తులను అమితంగా ఆకట్టుకుంది. అనంతరం చావడి వద్ద నుంచి ఊరేగింపును ప్రారంభించారు. అక్క ఓరుగుంటాలమ్మ ముందు వెళ్లగా, చెల్లి దేశమ్మ ఆమెను అనుసరించింది. బాజాభజంత్రీలు, బ్యాండు మేళాలు, విచిత్ర వేషధారణలు నడుమ శనివారం ఉదయం వరకు ఊరేగింపు నేత్రపర్వంగా కొనసాగింది. ఊరేగింపును పురస్కరించుకొని ఏర్పాటు చేసిన వాణియంబాడి డ్రమ్స్, కాంతారా బేతాళ నృత్యం, కర్ణాటక వారి బుట్ట బొమ్మల నాట్యం, ఆదిలాబాద్ వారి భామరా డ్యాన్స్, మంగళ వాయిద్యాలు ప్రత్యేకతను సంతరించుకున్నాయి. బాణాసంచా సందళ్లు ఆకట్టుకున్నాయి. ఊరేగింపు ముగిసిన అనంతరం దేవతల ఉత్సవ విగ్రహాలపను ఆలయాలకు చేర్చారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా డీఎస్పీ సయ్యద్ మహమ్మద్ అజీజ్, సీఐ విక్రమ్ ఆధ్వర్యంలో పోలీసులు భద్రతా చర్యలు చేపట్టారు. జాతర నిర్వాహకులు చిరంజీవిరెడ్డి, జ్యోతిరెడ్డి, ఆనం సురేష్, కృష్ణారెడ్డి, బాబు, దయానిధి, జ్యోతినాయుడు, గుణశేఖర్, మదన శ్రీనివాసన్, ఇంద్రారెడ్డి, కోలా బాలాజీ, జనార్దన్, ప్రసాద్, సేదు, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



వరలక్ష్మిగా ఓరుగుంటాలమ్మ, సింహ వాహినిగా దేశమ్మ

గ్రామదేవతలను దర్శించుకున్న మాజీ మంత్రి

గ్రామదేవతల ఊరేగింపు ఉత్సవాల్లో మాజీ మంత్రి ఆర్కే రోజా పాల్గొన్నారు. జాతర నిర్వాహక కమిటీవారు ఆమెకు సాదర స్వాగతం పలికి, కండువాలు వేసి సన్మానించారు. కొబ్బరికాయలు కొట్టి హారతులిచ్చి ప్రార్థించుకున్నారు. ఆమె వెంట మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం, వైస్‌చైర్మన్ బాలన్, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు రమేష్ రెడ్డి, నాయకులు గోపాల్ రెడ్డి, మురుగ, యువరాజ్, ఆనంద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



అమ్మవారికి హారతి ఇస్తున్న మాజీ మంత్రి ఆర్కే రోజా



జనసందోహం నడుమ ఊరేగింపు



కాంతారా బేతాళ నృత్యం



సాంస్కృతి కార్యక్రమాలు తిలకిస్తున్న జనం